# యాత్ర

విశాఖపట్నం స్టేషన్ కిటకిటలాడిపోతోంది.

గోదావరి ఎక్స్‌ప్రెస్ - యుద్ధానికి బయలుదేరుతున్న వీరుడిలా - రొమ్ము విరుచుకుని మరీ యార్డ్‌నుండి ప్లాట్‌ఫారమ్మీదకు వచ్చి నిలబడింది.

సాయంకాలం నాలుగ్గంటల వేళ... సముద్రపు గాలి కాస్త మళ్ళుతున్నా ప్లాట్‌ఫారమ్మీద ఎండ సెగ బాగానే ఉంది. సంపెంగ పూలు, ఏటికొప్పాక బొమ్మలు, తాండ్ర మామిడి రాయుళ్ళు, కూలీలు, అడుక్కుతినేవారు, చిన్నసైజు సద్దాంహుస్సేనుకు మల్లే పోజులు కొడుతున్న "టిటియీ"లు, టాఫీల బళ్ళ వాళ్ళు, ప్రయాణీకులు, వీడ్కోలు వాళ్ళ అరుపులు, చెమటలు, ఇవన్నీ కాక-

తెలుగును హిందీలాగ, హిందీని బెంగాలీలాగ, ఇంగ్లీషును ఉర్దూలాగా ఉచ్చరించడంలో ప్రత్యేకంగా తర్ఫీదు పొందిన రైల్వే సిబ్బందిలో ఒక చింతామణి లాంటి మైకాసురుడు - అరబ్బీ భాషలో తద్దినం మంత్రాలు చదువుతున్నాడు...

ఆ అశేష జనసందోహంలో ఇద్దరు - మనోహర రావూ, గవర్రాజూ - మొదటిసారిగా భాగ్యనగరం వెళ్ళాలి - చూడాలి అన్న సదుద్దేశంతో - "ఎస్-7" ఎక్కడో అని వెతుకుతున్నారు.

మనోహరరావు చేతిలో ఒక జిప్ సంచీ - బెడ్‌షీట్ వున్నాయి. గవర్రాజు హస్తమును ఒక సూట్‌కేస్ నాబడు వస్తు విశేషము అలంకరించి యుండెను.

ఇద్దరూ కూడా ఇంజన్ నుండి గార్డ్ పెట్టెదాకా రెండు సార్లు తిరిగారు. కాని - 'ఎస్-7' పెట్టె కనపడకపోయేసరికి గాభరాపడ్డారు.

అవతలి ప్లాట్‌ఫారమ్మీదకు ఆలస్యంగా వచ్చిన బొకారో ఎక్స్‌ప్రెస్ ఇంజన్ వేసిన కూతకు హడలిపోయిన మనోహర్‌రావ్ "ఇంకేముంది, బండెళ్ళి పోతోంది" అనుకుని ఎదురుగా ఉన్న పెట్టెలోకి సంచీతో సహా ఎక్కిపోయాడు. గూడ్స్‌పెట్టెలోకి మనోహర్‌రావు ఎందుకు ఎక్కాడో అర్థం కాని గవర్రాజు ఒకవేళ అదే "ఎస్ ఏడేమో"

అని నెంబర్ కోసం చూశాడు - కానీ ఆ అక్షరం - ఆ అంకె కనపడలేదు.

హఠాత్తుగా అయిడియా వచ్చిన గవర్రాజు - శరవేగాన జనాన్ని తోసుకుంటూ - "నేను మీకు సాయము చేతునా? "అన్న బోర్డున్న పంజరం దగ్గరకు పరుగెత్తాడు. గూడు ఖాళీగా ఉండడంతో ఒక టి.టి.యి.ని అడిగాడు. - "సార్ 'ఎస్-7' ఎక్కడా?"

'ఎస్. ఆరు, ఎస్. ఎనిమిది మధ్య ఉంటాది' అని జోకేసిన నల్లకోటాయన హాస్య ప్రియత్వాన్ని గవర్రాజు అనందించలేకపోయాడు.

మళ్ళీ పెట్టె నుంచి దిగిన మనోహరమూ, నల్లకోటు విట్టును తిట్టుతున్న గవర్రాజూ ఉమ్మడిగా ఒక రైల్వే కూలీని అడిగారు - 'ఎస్-7' ఎక్కడ బాబూ?

'అల్లదే - ఆ పదకొండో నెంబరుంది చూశారూ. అదేనండి 'ఎస్-7' అని తలపాగా గట్టిగా బిగించాడు ఆ మజ్దూర్.

మనోహరరావు బి.ఏ. [తెలుగు] పాసయాడు కానీ ఎసెల్సీ దాకా లెక్కలు నేర్చుకున్నాడు. గవర్రాజు పదవ తరగతి అరుసార్లు ప్రయత్నించి దాంతో సఖ్యత కుదరక మైత్రీ భావంతో ఆ పరీక్షనలా బతికిపోమని వదిలేశాడు, కానీ బ్రాకెట్టు వ్యాపారంలో వేల రూపాయలు ఆర్జించిన వాణిజ్యమేధావి. కాని వాళ్ళిద్దరికి ఎక్కడా ఎవరూ "పదకొండో నెంబరే ఏడుగా గ్రహించునది" అని చెప్పలేదు.

అయినా ఇది కంప్యూటర్ యుగం - అక్షరం ముక్క రాని వాడు ఆస్థాన విద్వాంసుడు, నిశానీదారు నేషనల్ లీడరు అయే రోజులు కదా! "ఏమో దేనినీ మనం శంకించరాదు" అని బుద్ధిమంతుల్లా "ఎస్ - 11" అని ఉన్న పెట్టె దగ్గరకు వెళ్ళి - కిటికీ పక్కన కూర్చున్న ఒక నడివయసు కళ్ళజోడాయన్ను అడిగారు.

"అవునండీ - ఇది ఎస్సేడే!" అన్నాడు.

'మరి - పదకొండని రాసి ఉంది కదా' అన్న సందేహం వెలిబుచ్చాడు గవర్రాజు.

'ఆ పదకొండు అని రాసి ఉన్న కాగితం నిన్న హైదరాబాద్‌లో అతికించిందండీ... దాని మీద ఇక్కడ కొత్త కాగితం అతికించడం మరిచిపోయారు!' అని వివరించాడు.

"హౌరా! హౌరా!" అని విస్తుపోయాడు మనోహరం.

ఈ అమ్రేడితాన్ని అపార్థం చేసుకున్న ఒక ప్లాట్‌ఫారం శాల్తీ - "ఇంకా ఎక్కడి హౌరాండీ! సరిగ్గా టయానికి రెండు పదికెల్లా ఎళ్ళిపోనాది - మళ్ళీ రేపే!" అన్నాడు.

'హౌరా - మజ్దూరు-
నీ కిది నా జోహారు
భాస్కరుడే
నీ ముందు బలాదూరు'

అని తన నోట్‌బుక్‌లో ఒక గేయం రాసుకున్నాడు మనోహరరావు.

నాలుగున్నర కెల్లా ఠంచన్‌గా కూత వేసి బయలుదేరిన గోదావరి ఎక్స్‌ప్రెస్ జాతి గుర్రంలా పరుగెడుతోంది.

ఎస్సేడు అనబడే ఎస్పదకొండులో 72 బెర్తులున్నాయి. 136 మంది ప్రయాణీకు లున్నారు. అరగంటలో అనకాపల్లొచ్చేసినాది. 136 కాస్తా 102 అయింది. ఎలమంచిలి దగ్గర మరో ఇరవై మంది దిగిపోయారు. అయినా ఇంకా పది మంది ఎక్కువగా ఉన్నారు. వారిలో తునివారిద్దరు కాగా, మిగతా ఎనిమిది మంది "ఆర్. ఏ. సి." అనబడే త్రిశంకు వర్గంలో ఉన్నారు – ఆ వర్గంలో ఒకడు గవర్రాజు.

అనకాపల్లిలో ఎక్కిన టి.టి.యి. మరియదాసు చాలా మర్యాదస్తుడు. అంచేత ఎవరినీ రిజర్వేషన్ లేకుండా ఎక్కించడం లేదు. కానీ తన తోకలాగా వెంటబడి తిరుగుతున్న పక్క పెట్టె వాళ్ళని మర్యాదగా లేదు పొమ్మని వెనక్కు పంపించి వేస్తున్నాడు.

హైదరాబాదు అయితే పోలేదు కాని రైళ్ళ ప్రయాణాలు బాగా చేసి అనుభవ జ్ఞుడయిన గవర్రాజు చొక్కా జేబులోంచి బాగా కనపడేలా ఒక ఇరవై కాగితాన్ని ఉంచుకుని మరియదాసు వెనకాలే తిరుగసాగాడు. చాలా భక్తి శ్రద్ధలు, వినయవిధేయతలు కనపరచసాగాడు. ఆయన కడగంటిచూపు పడినప్పుడెల్లా "ముఖాముఖీలో పాఠకులతో మొదటిసారిగా కలిసి మాట్లాడిన నవలత్రి" పడ్డంత థ్రిల్లూ సంతోషమూ వగైరా పడిపోతున్నాడు... కనీసం అట్లా ముఖంలో చూపిస్తున్నాడు.

ఒకసారి కాస్త మరియదాసు ఇటు చూడగానే "మా ఫ్రెండ్‌కేమో బెర్తుంది సార్! నాది ఆరేసి సార్... సికిందరాబాద్‌కు బెర్తు కావాల్సార్..." అని గవర్రాజు సవినయంగా అర్జీ పెట్టుకున్నాడు.

"ఇది కోటా పెట్టె కాదండీ... అన్ని బెర్తులూ వైజాగ్‌లోనే ఫుల్లయిపోయాయి" అన్నాడు మరియదాసు.

"టి.టి.యి ల మాటలకు అర్థాలే వేరులే" అని తెలిసిన గవర్రాజు "చిత్తం చిత్తం" అన్నాడు. కానీ సూర్యుడి వెనుక ఛాయాదేవిలా – హీరోయిన్ వెనుక మేకప్ కిట్ బాయ్‌లా మరియదాసు అడుగులో అడుగు వేస్తూనే ఉన్నాడు.

దాసు సగం పెట్టె కవర్ చేశాడు కష్టపడి... అలిసిపోయి, తన వెనకాలే ఉన్న గవర్రాజుని – "ఇదుగో ఇది పట్టుకోండి" అని తన చంకనున్న రసీదు పుస్తకాల నిచ్చి – "మీరు నా సీటులో ఉండండి – ఇప్పుడే వస్తా" అని టాయిలెట్ వైపు వెళ్ళాడు.

తన్ను అమెరికా రాయబారిగా అపాయింట్ చేసినంత శ్రద్ధతో – ఆ పుస్తకాలను అతి భద్రంగా, అమిత భక్తితో పట్టుకుని వెళ్ళి తలుపు దగ్గర ఉన్న టి.టి.యి సీటులో కూర్చున్నాడు. మడిచిపెట్టి ఉన్న నల్లకోటును మడి బట్టలా భావించి ఎడంగా సర్దుకున్నాడు. మరియదాసు పేరు రాసి, కింద ఇనుప బద్దీకి గొలుసుతో కట్టి ఉన్న, తాళం వేసి ఉన్న నల్లపెట్టెను – తిరుమలపై వెంకన్న గుడిలో హుండీని చూసినంత పవిత్ర భావంతో చూశాడు.

తుని వచ్చింది కాని, మరియదాసు రాలేదు.

తుని నుంచి రైలు బయలుదేరుతుండగా చకచకమని నలుగురు ఠీవిగా ఎక్కారు.

బోగీకి బోగీకి మధ్య ఉన్న తలుపు వేసేశారు. మిగతా నాలుగు తలుపులకు గొళ్ళాలు పెట్టారు. ఆ వైనం అంతా చూసిన గవర్రాజు మనసు కీడు శంకించింది.

ఇంకా పట్టుమని ఏడన్నా కాలేదు. చలికాలం కాబట్టి కాస్త చీకటిగా ఉంది. కానీ ఈ వేళప్పుడు "డకయిటీయా?" – ఉండదులే అంది అతని అంతరాత్మ.

'నీ మొహం – బందిపోట్లు అర్ధరాత్రిళ్ళే రావాలని, బస్సుల్నే దోచుకోవాలి' అని రూలేమీ లేదు కదా..

"ఏవండీ... ఈ బోగీ టి.టి.యి. మీరేనా?" అన్న ప్రశ్న ఎవరినో ఎవరో అడుగుతున్నారులే అనుకున్న గవర్రాజు అదే ప్రశ్న మరింత క్లోజప్‌లో, కొంత స్టీరియో ఎఫెక్ట్‌లో వినబడేసరికి ఉలికిపడి లేచి నిలుచుని – "అవున్సార్!" అన్నాడు.

'మరయితే ఆ కోటు అలా పడేసి నిద్ర పోవడంలో మీ ఉద్దేశం..."

'నిద్ర పోలేదు సార్! లెట్రిన్ కెళ్ళా'

'వాట్'–

'నేను కా స్సార్...'

'బోగీ కంప్లీట్ చేశారా?'

'లేస్సార్–'

'చేయకుండానే ఇట్లా అర్థాంతరంగా కూర్చోడంలో మీ ఉద్దేశం?'

'కూర్చోమన్నారు సార్!'

'ఎవరు రైల్వే మినిష్టరు గారా? ఫోన్‌చేసి చెప్పారా? ఎంత కలెక్టయింది కాష్!'

'తెలియదు సార్–'

'ఛార్ట్ ఏదీ–' అని అథారిటీతో అడిగిన టి.టి.యి కు పుస్తకాలన్నీ ఇచ్చేశాడు గవర్రాజు... వాటి మధ్యనున్న 'నాలుగో పెళ్ళాం' అన్న 'నీలి పుస్తకం' చూసి ఐసయిపోయిన అథారిటీ అయ్యవోరు, 'లే' అని గవర్రాజుని పక్కకు జరగమని తానా సీటులో కూర్చుని ఆ పుస్తకం చదవసాగాడు.

ఈలోగా టాయ్‌లెట్ నుంచి బయటికొచ్చిన మరియదాసు – తన సీటులో కూర్చున్న అతడిని ప్రయాణీకుడు గవర్రాజుగా భావించి – "ఏందయ్యా! కాస్త చూసుకోమని చెప్పి వెళితే నా పుస్తకాలన్నీ తెరిచి చూస్తున్నావు... నీకింక బెర్తు లేదు లేదు' అని ఆగిపోయాడు. పుస్తకం వెనకాల ఉన్న మొహం చెకింగ్ స్వాడ్ లీడరు సుందరంది అని గ్రహించి సెల్యూట్ కొట్టినంత పనిచేసి – లాగు తడిపేసుకున్న చిన్నబ్బాయిలా మొహం పెట్టి–

'నమస్తే సార్!' అని, మధ్యాహ్నం కాన్వెంట్ జంక్షన్ దగ్గర నాలుగు మిరపకాయ బజ్జీలు తిన్నాన్సార్ – అవీ' అని పొట్ట తడుముకున్నాడు – నాలుగో పెళ్ళాం రాసక్రీడల వివరణల్లో మునిగి తేలుతున్న సుందరంగారు – రెండున్నర గంటల బూతు సినిమాలో ఆఖరి అయిదు నిమిషాల నీతి సీనులాగా – హఠాత్తుగా వాస్తవికతలోకి వచ్చారు.

"ఏం దాసూ... నీదేనా ఇది!"

"హిహిహి! ఉంచండి సార్!..."

'మరయితే ఆ న్యూ రెక్రూటెవరూ?' అన్నాడు రెండు టాయిలెట్ల మధ్య జాగాలో ఒదిగి నిలుచున్న గవర్రాజును చూపిస్తూ–

'న్యూ రిక్రూట్ కాదు సార్ – ఆరేసీ పాసింజరు. నే నవతలికి వెళుతూ కాస్సేపు – చూసుకోమన్నానంతే!"

"ఓ ఐసీ! అయితే మన వాళ్ళు ముగ్గురు అటునుంచి వస్తున్నారు. మీట్ దెమ్... పని పూర్తిచెయ్" అంటూ మరియదాసు వైపు సన్నగా నవ్వి – "నాలుగో పెళ్ళాం" దగ్గరి కెళ్ళిపోయారు సుందరం.

పై బెర్త్‌మీద వాలి కూర్చున్న మనోహరరావు పాకెట్ బుక్ తెరిచి రాసుకోసాగాడు.

'కనుబొమ్మలా అవి, కానే కావు నా గుండెను బిగించిన బ్రాకెట్లు ఆశలకందని చాకలెట్లు, మూగమనసుల లాకొట్లు–"

అని తరువాతి పంక్తికోసం వెతుకులాడుతుండగా ఆ కనుబొమలుగలావిడ భర్త మిలిటరీ యూనిఫారంలో వచ్చాడు. అదిరిపడి మనోహరం పుస్తకం మూసివేశాడు. కలాన్ని జేబులో పెట్టుకున్నాడు. అటు తిరిగి పడుకున్నాడు.

సామర్లకోట వచ్చేసరికి మరియదాసు గవర్రాజుకి బెర్తివ్వడం, వైజాగ్ నుంచి తన జేబులో జెండాలా ఎగురుతున్న ఇరవైని రాజుకృతజ్ఞతగా ఇవ్వడం – సుందరంగారు అన్నవరంలో దిగిపోతూ.....

'దాసూ! ఎల్లుండి ఈస్ట్ కోస్టులో వస్తావు కదా – అప్పుడిస్తా' అని 'నాలుగో పెళ్ళా'న్ని వెంటపెట్టుకుని దిగిపోవడం జరిగాయి. గవర్రాజు సూట్‌కేస్ నుంచి తలగడ తీసి బెర్త్‌మీద ఉంచి తువ్వాలు తీసుకుని కాస్త విశ్రమించాడు.

కాస్సేపు స్తిమితంగా మిత్రులిద్దరూ కబుర్లాడుకున్నారు. రాజమండ్రిలో పెరుగన్నం అనబడే గంజి కూడు పొట్లాలు, గారెలు అనబడే కేరంబోర్డు స్ట్రయికర్లు నాలుగింటిని కొన్నారు, తిన్నారు. మనోహరం సిగరెట్టు, గవర్రాజు చుట్టా వెలిగించారు. నిడదవోలు దాటకుండానే నిద్రదేవి ఒడిలోకి జారిపోయారు.

రైలు విజయవాడలో ఆగి – బయలుదేరింది. కొండపల్లి దాటక ముందే ఎవరో చెయిన్ లాగినట్టయింది. దీనంగా కూత కూస్తూ రైలింజన్ ఆగలేక ఆగలేక ఆగింది.

హఠాత్తుగా "ఎస్సేడు" లో ఏడుపులారంభమయ్యాయి. "నా సూట్‌కేస్ కనపడ్డంలేదే?"

'ఓర్నాయినో పెళ్ళి బట్టలున్న పెట్టె నెవరో ఎత్తుకుపోయారండీ.'

'ఏమేవ్ సీతా – నీ మెళ్ళో గొలుసేదీ?"

'నా పర్స్‌సార్ – అందులో టిక్కెట్టుంది సార్...

అందరితో పాటు గవర్రాజు పెట్టె కూడా పోవడంతో అతడికి మిగిలింది ఒక దిండు మాత్రమే! అయినా టిక్కెట్లు జేబులో ఉండి, తెచ్చుకున్న డబ్బు అయిదొందలూ

తలగడలో ఉంచుకున్న గవర్రాజు ముందు చూపును అభినందిస్తూ మనోహరం ఒక హైకూ రాశాడు తన పుస్తకంలో.

"చీకట్లో ఉక్కు పులి కూస్తూంది.

పత్తికాయల మధ్య కాగితం పచ్చగా ఫక్కుమంది.

తల లూచిన పైరులేమన్నాయి?!'

రైల్వే పోలీసులు హుటాహుటిని నిద్ర మేల్కొన్నారు. బెల్టులు బిగించారు. వారిలో ఒక హెడ్డయ్యగారు బోగీ తలుపు బార్లా తెరిచి ఉండడం గమనించి – "ఇదిగో ఇలాగే పొయ్యుంటారు. దొంగవెధవలు" అని టార్చిలైటును తుప్పల మీదకు వేశాడు. అంత ఖచ్చితంగా దొంగలు ఆ తుప్పల మీద నుంచే పోయారు అని ఊహించి చెప్పగలిగిన తమ నాయకుడి పత్తేదారీ కౌశల్యానికి ఆయన శిష్యులు కాస్సేపు అబ్బురపడ్డారు.

అదయిన తరువాత బోగీలో కెళ్ళి గోడుగోడుమంటున్న వారందరికీ తలో ఫారమూ ఇచ్చారు.

దానిలో–

'నీ పుట్టిన ఊరేది, నీకు గల స్వంత ఇంటి విలాసమేమి, పుట్టుమచ్చలు ఎక్కడున్నాయి. మీరు కోల్పోయిన వస్తువులేవి? అవి మీవేనా?' సరిగ్గా ఇవే కాదు కాని ఇలాంటి ప్రశ్నలకు సమాధానాలు రాయమన్నారు ఆ ఫారాల మీద.

"ఇదెక్కడ గోలండీ అసలే సర్వస్వమూ కోల్పోయి నేనేడుస్తుంటే – ఈ దరిద్రపు ఫారాలేమిటండీ!" అన్నాడు, పెన్ను కూడా సూట్ కేసుతో పాటు పోగొట్టుకున్న ఒక బాధితుడు.

కానిస్టేబుల్ కన్నప్ప ఆశ్చర్యపడ్డాడు – "అదేమిటండీ మీరు మగ పురుషులు కదా! మీరు సర్వస్వం పోగొట్టుకోవడమేమిటి? అది పోగొట్టుకునేది ఆడాళ్ళు కదా?"

బాధితుడు కొరకొరా చూశాడు.

"అసలు మన్దేశం వాళ్ళకు బొత్తిగా విశ్వాసం లేదండీ. ఇంతకుముందిలాటి డకయిటీలు జరిగితే నాలుగు అయిదు గంటల తరువాత ఏ జంక్షన్ వచ్చేదాకానో ఆగి అక్కడ ఫిర్యాదులు రాసివ్వవలసి వచ్చేది. కానీ ఇప్పుడో ఈ ఫారాలు తయారుగా ఉంచుకొని అలా దొంగతనం జరిగిందో లేదో మీకు ఇలా ఇచ్చేస్తున్నాం గదా – ఈ ఇంప్రూవ్ మెంటు నెవరూ మెచ్చుకోరేమిటండీ" అని బాధపడ్డాడొక ఆర్పీఎఫాయన.

కన్నీళ్ళతో, వెక్కిళ్ళతో, ఓదార్పులతో జరిగిపోయిన దొంగతనాల కథలు చెప్పుకో వడంతో జనం కాస్త సర్దుకున్నారు.

రైలు కదిలింది.

ఠంచన్‌గా ఆరున్నరకెల్లా సికింద్రాబాద్ స్టేషన్ చేరింది. రెండవ ప్లాట్ ఫారం మీద ఆగింది.

బిలబిలమంటూ రైల్వే కూలీలు గర్భగుడిలోకి హారతి కోసం వస్తున్న భక్త కోటిలా దూసుకొచ్చారు. పెట్టెంతా సందడీ, గందరగోళం!

బెర్త్ అంచున పెట్టివున్న తన జిప్‌బాగ్ హఠాత్తుగా కదలడం, ఒక కుర్రాడి

చేతిలోకి వెళ్ళడం వాడు దాంతోబాటు ఇంకేదో సూట్ కేస్ పట్టుకుని నడుస్తుండడం చూసిన మనోహర్‌రావ్; వచన కవి కదిలినంత వేగంగా కదిలి, ఎగిరి దూకాడు.

అశేష జన సందోహం మధ్య కూలీలు అనేకులు. వారిలో ఎందరి నెత్తుల మీదనో ఎన్నో సూట్ కేసులు. కాని మనది జిప్‌బాగ్ కదా అంచేత తల మీదకు రాలేదు – ఆ కారణంగా తిరుమలపై బోడి గుండ్లలో మన గుండేదో కనుక్కోమన్నట్లయింది మనోహరరావుకు. ఆ కారణంగా తన బాగ్ ఉన్న కూలీ ఎవరో తెలియక గాభరా గాభరాగా నడుస్తున్నాడు. దారిలో ఒక చేపల బుట్ట లాటిది కాళ్ళకు తగిలి పడబోయినంత పనయి అసంకల్పిత ప్రతీకార చర్యగా ఒక భుజం పట్టుకున్నాడు. ఆ భుజం తాలూకు మహిళ వెళ్ళి "దొంగ సచ్చినాడా – ఇదేం పొయ్యేకాలంరా నీకు" అనేసరికి "తల్లీ! క్షమించు! పొరపాటు" అని చెప్పి చూసేసరికి జనాలు కూలీలు సామాను "స్లో మోషన్" లో మెట్లెక్కుతున్నారు. అదుగో ఆ పై మెట్టు మీద మెరిసింది తన గళ్ళ గళ్ళ జిప్ బాగ్. –

ఎట్లా జనాన్ని దాటాడో – ఎందరిని తొక్కాడో – ఎందరి చేత తిట్లు తిన్నాడో తెలియదు కానీ 'నిశ్చితార్థంబు వదలరు నిపుణమతులు" అన్న చందాన మనోహరరావు గమ్యం చేరి ఆ కూలీని సమీపించి గర్జించాడు. – "ఏయ్ కూలీ ఆగవయ్యా ఆగు – నా బాగ్‌ని నన్నడక్కుండా తీసుకుపోతున్నావే?

కూలీ ఆగి తిరిగి చూశాడు – "ఏందివయ్య గట్టరుస్తావ్ – నే నీ బాగ్ మా ఇంటికి కొండబోతన్ననా ఎట్ట –?"

"ముందా బాగిటివ్వు?" అన్నాడు మనోహరరావు – ఆ కూలి నెత్తి మీదున్న సూట్ కేస్ స్వంతదారుడయిన ప్రయాణికుడు రావును చూసి – "నేనిందాకట్నించి మొత్తుకుంటున్నాన్సార్. ఆ సూట్ కేస్ నాదేగాని – బేగ్ నాది కాదయ్యా అంటే వినిపించుకోకుండా తెచ్చేస్తున్నాడు...'

"నా కూలీ నాకియ్యి! నీ బేగ్ తీసుకోపో" అన్నాడు కూలీ.

"నేను నిన్ను బేగ్ మోసుకురమ్మన్నానా – నేనేమీ కూలీ ఇవ్వను" అన్నాడు మనోహరరావు.

"నీ మొగం సూస్తే గట్లనే ఉన్నది. కూలోని సేత సంచి మొయ్యించి పైస లెగ్గొడ్తవ్ – పోపో! నీలాంటి మారాజులున్నారు గన్కనే పైసలొస్తలేవు" అని సూట్ కేస్‌తో నిష్క్రమించాడు కూలీ. అతనితో బాటే ప్రయాణీకుడూ.

పోయిన బాగ్ చేతికి వచ్చిన ఆనందం పూర్తిగా అనుభవించకముందే మనోహర రావుకు గవర్రాజు గుర్తుకొచ్చాడు.

గాభరాగా, మెట్లు దిగుతున్న ప్రయాణీకులను ఎదురు తోసుకుంటూ వెళ్తున్న మనోహరరావుకు గవర్రాజు కనపడడంతో పోయిన నిధి దొరికినట్లయింది.

"అసలే కొత్త ఊరు. ఇట్లా నన్నొదిలేసి వెళ్ళిపోతే ఎలా బ్రదర్" అన్న గవర్రాజుకు మనోహరరావు తన పాట్లను వివరించాడు.

"అమ్మో! జాగ్రత్తగా ఉండాలి. నా సూట్ కేసు ఎటూ పోయింది. నీ బాగన్నా క్షేమంగా ఉండాలి" అన్నాడు గవర్రాజు.

సికింద్రాబాద్ స్టేషన్ బయట రిక్షాలు, ఆటోలు, కూలీలు, పిల్లల ఏడుపులు, పోలీసుల ఈలలు - అచ్చం చంద్రశేఖర్ సర్కారులా ఉంది మొత్తం వ్యవహారం. ఏదీ కదలడం లేదు. ఆంధ్రప్రదేశ్ ఎక్స్‌ప్రెస్ పోయే వేళ, గోదావరి వచ్చే వేళ ఒకటే కావడంతో ఏర్పడిన గందరగోళాన్ని వర్ణింప త్యాగరాజు అండ్ అన్నమయ్యల తరం కాదు.

అది చూసి బిత్తరపోయిన గవర్రాజు "ఇంతకూ మనం వెళ్ళబోయేది ఎక్కడికి" అన్న 'లీడింగ్ క్వొశ్చన్' వేశాడు.

'నా మిత్రుడివి, నన్నా గద్దె ఎక్కించిన వాడివి నువ్వే ఇట్లా వెన్నుపోటు పొడుస్తున్నావా' - అని అలనాడు సీజర్ బ్రూటస్‌ను, ఈనాడు చంద్రశేఖర్ రాజీవుడిని చూచిన చూపు చూశాడు మనోహరరావు గవర్రాజు వైపు.

"రాజూ! మనం నీ నేస్తం ఆ బ్యాంక్ ఆఫీసర్ భాస్కరం ఇంటికి వెళ్దాం అన్నావు కదా!" అన్నాడు విశాఖపట్నంలో బయలుదేరే ముందరి ఒప్పందం గుర్తుకు తెచ్చుకుంటూ.

"సారీ బ్రదర్! బయలుదేరినప్పటినుంచి ఒక దాని తర్వాత ఒకటిగా ఎదురైన వింత అనుభవాలతో మతి పోయినట్లయింది. నిజమే! భాస్కరం ఇంటికే వెళ్దాం. వాడికి రాశాను కూడా. అసలు వాడు స్టేషన్‌కు రావాల్సింది మరి ఎంచేతనో రాలేదు. పోదాం పద!" అన్నాడు గవర్రాజు.

"బస్సా ఆటోనా?"

"మరి బస్సుల వివరాలు తెలియవు కదా! ఆటోలోనే వెళ్దాం."

"ఔను ఆటోవాడికి చెప్పడానికి మీ వాడుండే పేట పేరు చెప్పాలి కదా! ఆ అడ్రసు కాగితం తీసి రెడీగా ఉంచుకో" అని మనోహరరావు అనగానే గవర్రాజు నెత్తి బాదుకున్నాడు.

"ఏవయింది?" అని అడిగాడు మనోహరం.

"నా అడ్రసుల పుస్తకం సూట్ కేసులో ఉంది."

"దాని కేం! సూట్ కేసులోంచి తీయి!" అన్న మరుక్షణానికి మనోహరానికి కొండపల్లి తుప్పలు, టార్చిలైటు గుర్తుకొచ్చాయి.

"మరిప్పుడెట్లా?" అని రోడిన్ శిల్పం 'థింకర్'లాటి పోజులు పెట్టారు రావు, రాజూ.

కాస్సేపు తర్వాత 'యురేకా' అనే అర్థంలో "ఆ!" అన్నాడు రాజు.

"అంటే ఏవిటి?" - అన్నట్లు చూశాడు మనోహరరావు.

"భాస్కరం ఉండే ఇంటి నెంబరు అదేదో తల్లికోట యుద్ధం జరిగిన తారీకులా ఉంటుందిరా!" అన్నాడు గవర్రాజు.

"ఇంకేం? తల్లికోట యుద్ధం ఎప్పుడు జరిగింది?"

"ఏడిశావ్ లేవోయ్! అది తెలిస్తే ఎసెల్సీయే పాసయి ఉండనేమిటి?"

"నువ్వు ఎసెల్సీ పాసవకపోతే దేశానికి వచ్చిన నష్టం లేదు కాని, అడ్రసు లేకపోతే మనిద్దరికీ చాలా సమస్యలొస్తాయి" అన్నాడు మనోహరరావు.

"కర్మపుర, చార్మినార్ కేఫె పక్క గల్లీలో, లాండ్రీ ఎదురింటికి కుడి పక్కనో, ఎడంపక్కనో ఉంటుంది అనుకుంటా!"

"మా నాయనే! పండిత జగన్నాథ రాయలంతటివాడవురా అబ్బీ! ఇంతకూ అడ్రసంతా వీకరువు పెట్టావు. ఇంకేం? మనం అపాటి సమాచారంతో హైద్రాబాద్ దున్నేయవచ్చు పోదాం పద!" అని "ఆటో!" అని పిలిచారు సంయుక్త కంఠంతో.

అటూ, ఇటూ పోతున్నాయి గాని ఆటోలు అగడం లేదు.

చివరకు ఒక ఆటోవాడు ఆగాడు. మనోహరరావు గమ్యం చెప్పాడు. ఆటోవాడు శ్రద్ధగా విని – "చాలీ సైతది!"

"అంటే ఎంత ఇరవయ్యా?"

"కాదు నల్బై!" అన్నాడాటోవాడు.

"మీటర్ మీద రావా?"

"ఎందుకు రామయ్యా! ఒస్తం! కాని అ చార్మినార్ కెల్లి మల్లి సవారి దొర్కదు. పాంచ్ రుప్యా ఎగ్స్ట్రా ఇవ్వాలి!"

"సరే!" అని కూర్చున్నారు మిత్ర ద్వయం.

సిమ్మండ్ ఫ్రాయ్డ్, కార్ల్ యుంగ్ తర్వాత అంతటి వారు ఆటో డ్రైవర్లు. నగరానికి కొత్త వారొస్తే ఇట్టే పసిగట్టగల వారి నైపుణ్యం చూసి విదేశాలలోని మన రాయబారులు నేర్చుకోవలసిందెంతయినా ఉంది.

ఆటోవాడు వాళ్ళిద్దరికి గైడుగా తనను తానే నియమించుకుని మాట్లాడసాగాడు.

"ఇది రైల్ నిలయ మంటర్! మన రైల్వేల దఫ్తరన్నమాట! గదేమో తార్నాక. అటుబోతే ఎన్టీ రామారావ్ ఆశ్రమ మొస్తది. గిది ఉస్మానియ యూనివర్సిటీ... ఈడ సాయిబాబా గట్టించిందీ గుడి. దీన్ని శివమంటరు. ఇదేమో తిల్కనగరు. గదేంది పోలీసు లైన్సు. అటుపోతే మల్కపేట్ రేసుల జరుగుతాయి. అడకి కొండబోతునా? గుర్రాలాట ఆడుతారా! ఇటుపోతే విజయవాడ!"

ఆటో వాడి అవ్యాజ ప్రేమకు సంతోషమూ, అనేక ముఖ్యప్రాంతాలను చూపించి వివరిస్తున్న వాడి వైదుష్యానికి కృతజ్ఞతా ఒక వంక –

అసలు వాడు వెళ్తున్న రూటు సరయినదేనా, ఆ మాట అడిగితే ఊరికి కొత్తవారి మన్న గుట్టు కాస్త బయటపడిపోయి ఇంకాస్త తాటాకులు కడతాడేమో నన్న భయం ఇంకో వంక.

ఇట్లా డోలాయమాన మనస్కులైన మిత్రులిద్దరూ ఆటోవాలా 'ఇటుపోతే విజయవాడ' అని వినగానే కొంపదీసి ఆటోని విజయవాడ దాకా లాగించేసి రెడు వేల

మూడు వందలిమ్మంటాడేమో నని.

"నాయనా! మమ్మల్ని చార్మినార్ కేఫ్ దగ్గరకు తీసుకుపో అంటే విజయవాడ దారి కెందుకొచ్చావు?" అన్నాడు గవర్రాజు.

"అదేంది సార్! అడకే పోతుంటిమి కదా!"

అని గిరుక్కున తిరిగి ఒక పెట్రోలు బంకులోకి పోయి "ఒక ముప్పై ఇవ్వండి సార్!" అని మనోహరరావుఇచ్చిన డబ్బు బంకు కుర్రాడికిచ్చి పెట్రోలు పోయించుకున్నాడు.

ఆటో మళ్ళీ బయలుదేరింది. మూసీ నది, పురానాపూల్, అఫ్జల్ గంజ్, కోఠీ, మొజాంజాహి మార్కెట్, ఉస్మానియా దవాఖానా, నయాపూల్, హైకోర్టు అన్నీ చూపించిన ఆటో వాడు హఠాత్తుగా బండి ఆపి "గదేంది చార్మినార్ సూడండ్రి!" అన్నాడు.

"దిగమంటావా?" అన్నాడు మనోహరరావు.

"లేకపోతే మళ్ళీ స్టేషన్‌కు కొండబొమ్మంటారా?" అని విస్తుశాడు ఆటోవాలా

"మరి చార్మినార్ కేఫ్ ...?" అన్నారు.

"అదో! అదే చార్మినార్! ఆ కనిపిస్తదే ఇరాని ఓటలదే అయుంటది. అక్కడ అడగండ్రి. నా పైసలివ్వండి." అన్నాడు ఆటోవాలా.

చార్మినార్ కళావైభవం చూసి మురిసిపోతూ గవర్రాజు – "నిజంగా ప్రేమంటే ఇదేనోయ్! ఏమైనా సుల్తానులు ప్రేమించారంటే ఇట్టే తాజమహాళ్ళు, చార్మినార్లు కట్టించేస్తారు."

"అవును అది అమర ప్రేమ!" అన్న మనోహరరావు మనసులో [ప్రియా! నా అశ్రు వొక్కటి ఘనీభవించె – కాల స్రవంతి నధిగమించి శిల్పమై నిలిచె] అన్న పంక్తులు ప్రాణం పోసుకుంటుండగా "సారూ! నా డబ్బు లివ్వండి" అన్న గోల వినిపించింది.

గవర్రాజు మీటర్ చూశాడు. ముప్పై ఏడు రూపాయల అరవై పైసలయింది.

'అమ్మ బాబోయ్!' అనుకోక ముందే 'కంటికి కనపడిన దానిని అంతటిని నమ్మకండి' అన్న వేదాంత సూక్తిలా ఆటో డ్రైవర్ "ఈ చార్టు సూడండ్రి! ముప్పై ఏడు రూపాయల అరవై పైసలు అంటే నలభై అరు అయింది. ఎక్స్ట్రా అయిదు కలిపితే యాభై యొక్కటి ఇవ్వండి" అని వివరించాడు.

ఈ 'హయ్యర్ మాథమెటిక్స్' అర్థం కాని గవర్రాజు ఒక రోజు బ్రాకెట్ నెంబర్ తప్పయింది అనుకుంటే సరిపోతుంది అనుకుని వాడి కా యాభై యొకటే ఇచ్చేశాడు. వాడు తుర్రుమన్నాడు.

ఆ చుట్టు పక్కల ఇరానీ హోటలు దేని మీదా 'చార్మినార్ కేఫ్' అని లేదు అని, కర్మపుర అనేది ఆ చుట్టు పక్కల లేదు అని తెలియడానికి ఇంకో అరగంట పట్టింది.

ఆ పాటికే అకలి వేస్తూండడంతో ఆ పక్కనే ఉన్న ఒక నాయర్ హోటల్ కెళ్ళి ముఖాలు కడుక్కుని టిఫిన్ తిన్నారు. కాఫీ తాగుతుండగా మనోహర రావు "గవర్రాజా? ఇందాక ఆటోవాడికి డబ్బు లిచ్చానే అప్పుడు పెట్రోలు బంకులో

ఇచ్చిన ముప్పై మినహాయించుకున్నానా?" అని అడిగాడు.

గవర్రాజు – తను ప్రేమించిన విజయశాంతికి టైలర్ రాజేంద్ర ప్రసాద్‌తో పెళ్ళి నిశ్చయమయిన వార్త తెలిసినప్పుడు, లారీ డ్రైవర్ బాలకృష్ణ పెట్టే మొహంలాటిది పెట్టాడు.

"ఎనభై రూపాయలు ఆటోకయింది. ఇంకో ఇరవై చేరిస్తే ఏకంగా వైజా గెళ్ళిపోదుం కదా!" అన్నాడు గవర్రాజు.

"వగవకు మిత్రమా! అందుకనే పోతన అన్నాడు – 'కారే రాజుల్' అని. రాజ్యాలు, రూపాయలు పోతాయి. నిలిచేది ఆ అనంత ప్రేమ ఒక్కటే" అన్న మనోహరానికి శ్రీ టైర్ బెర్త్ హరిణేక్షణ అపూర్వ సౌందర్యం గుర్తుకు వచ్చింది. ఆ వెంటనే వాళ్ళాయనా గుర్తు కొచ్చాడు. ఆ టాపిక్ నంతటితో వదిలేశాడు.

"ముందా చార్మినార్ ఎక్కి చూద్దాం పద! పదయ్యాక మీ భాస్కరం బ్యాంకికి ఫోన్ చేస్తే సమస్య తీరిపోతుంది" అన్న మనోహర్ రావ్ తెలివి తేటలకు అబ్బుర పడిన గవర్రాజు "సరే" నన్నాడు.

చార్మినార్ ఎక్కా రిద్దరూ. ఆ పైనుంచి చూస్తే కింద బొమ్మరిల్లులా ఉంది నగరం.

'గగనాని కెగసెను ప్రేమ
కాలాన్ని దాటెను జ్ఞాపకం
అలజడి సముద్రం మధ్య
నిశ్చలమైన యోగ ముద్ర!' – అనుకుంటూ

గత చరిత్రలోని అమర ప్రేమికులను గుర్తుకు తెచ్చుకుంటూ అర్ధ నిమీలిత నేత్రుడయి ఉన్న మనోహరరావునూ –

"ఎంత జనం! ఎంత జనం! మా వైజాగ్‌లో అల్లా ఆ సాగరగిరి కనకదుర్గ ఆలయం దగ్గర డాల్ఫిన్ కొండంచున నిలబడితే పోర్ట్ ఛానల్‌లో సముద్రంలో ఓడలు, లాంచ్‌లూ బుల్లి బుల్లిగా కన్పడ్డం తా నెరుగును. కాని ఇక్కడ ఈ జనం, షాపులు, సందడి అంతా ఒక చిన్న బొమ్మల కొలువు దృశ్యంలా ఉంది. ఎంత జనం! ఎంత జనం! వీ రందరూ నా బ్రాకెట్ నెంబర్ మీద ఒక్కొక్కరు ఒక్క రూపాయంటే ఒక్క రూపాయి కాస్తే చాలు ఎంత లాభ మొస్తుందో" అని అంచనా వేసుకుంటూ కిందకు దూరపు చూపులు చూస్తున్న గవర్రాజునూ –

"ఏమయ్యా! మీకు చార్మినారే దొరికిందా 'సూసైడ్' చేసుకోవడానికి?" అన్న కరుకు మాటలు బాంబుల్లా పేలి హడలగొట్టాయి.

తిరిగి చూస్తే హెడ్ కానిస్టేబుల్ యాదగిరి నిలబడి ఉన్నాడు. గుబురు మీసాలతో, పదును కోపంతో, చేత్తో వాకీ టాకీతో...

అసలేమయిందీ తెలియక తికమక పడి జవాబు చెప్పేలోపుగానే – "మీరు చస్తే చస్తరు గాని ఆ కిందెవరి మీదో పడి వాణ్ణి కూడా సంపాలటయ్యా? ఆ ఉసేన్ సాగరుంది, రైలు పట్టాలున్నాయి, ఎలకల మందుంది – అవన్నీ వదిలి ఈ పోలీసు

స్టేషన్ కాడే చచ్చి మమ్మల్ని చంపాలా, నడ్వండి స్టేషన్‌కు... బొక్క లిరగదంతే అన్నీ సర్దుకుంటయి!"

"బాబోయ్! ఏమిటండీ మీ రనేది? మాది వైజాగండీ! మా ఫ్రెండ్ భాస్కరం ఇల్లు కర్మపురలోనండీ! అది దొరక్కపోతే పదింటిదాకా ఇట్లా గడిపేసి, అతడికి ఆఫీసుకు ఫోన్ చేసి..." అని గవర్రాజు, మనోహరం విడివిడిగా జవాబుగా చెప్పిందేదీ వినిపించుకోక వారిద్దరి మెడమీద చెరోచేయి వేసి కిందకు నడిపించి వేన్ ఎక్కించాడు యాదగిరి.

"అయిపోయాయి మన జీవితాలు! బతికి బయటపడితే కాలో, చెయ్యో, కన్నో పోయి జీవితాంతం అవిటిగా ఉండాల్సిందే. లేదా కోర్టులో శిక్షిస్తే మళ్ళీ వైజాగ్‌లో తలెత్తుకోలేము. అప్పుడీసారి నిజంగా ఆత్మహత్య చేసుకోవల్సిందే" అని బేలగా, దీనంగా, మూగగా రోదిస్తున్న వారిని మోసుకుంటూ పరుగెత్తింది పోలీసు వేన్.

ఆ వేన్ కమీషనర్ వారి ఆఫీసు చేరకముందే వాకీటాకీ మీద ఏదో అర్జెంటు సంభాషణలు వినపడ్డాయి. యాదగిరికి కూడా గొంతులో వణుకు పుట్టించేంత తీవ్రమయిన దేదో జరిగింది.

కమిషనర్ ఆఫీసు ప్రాంగణం అంతా చాలా గందరగోళంగా ఉంది. అటూ, ఇటూ కార్లు, వేన్లు సైరన్లతో తిరుగుతున్నాయి. ఏదో కారుమేఘం కమ్ము కొస్తున్నట్లుగా ఉంది. వేన్ ఆగగానే దిగి, సెల్యూట్ కొట్టాడు యాదగిరి. అధికారి ఇతగాడిని ఏదో అడిగితే – అతడు తమని చూపించాడు. అధికారి అరిచాడు.

యాదగిరి తల వంచుకున్నాడు.

అధికారి లోపలకి వెళ్ళిపోయాడు. మరుక్షణం యాదగిరి వేగంగా వేన్ దగ్గర కొచ్చి, వెనక తలుపులు తీసి "బతికిపోయా రయ్యా! గింకెప్పుడూ ఇస్మటి వెధవ పనులు తలపెట్టకండి! తెలిసిందా! ఇంకో రెండు గంటలలో ఊరు ఊరంతా కర్ఫ్యూ పెడతారు. జల్దీ మీ ఇళ్ళకు బొండి. వీధిల గనపడితే తంతరు – ఆఁ!" అన్నాడు.

వాళ్ళిద్దరినీ వేన్ నుంచి తోసినంత పనిచేసి తలుపులు మూయించి, డ్రైవర్ పక్కన కూర్చున్నాడు యాదగిరి.

వేన్ కుయ్యో మంటూ సైరన్ మోతతో బయలుదేరింది.

'అసలు ఇదంతా జీవితమా, తెలుగు సినిమానా?' అని మిత్రులిద్దరూ ఆశ్చర్యం ఇంకా పూర్తిగా పడక ముందే – తమ బ్యాంక్‌కు రక్షణ విషయమై కమిషనర్‌తో మాట్లాడడానికని తన జనరల్ మేనేజర్‌తో అటు వచ్చిన భాస్కరం – "ఒరేయ్ గవర్రాజా! నువ్వు ... ఇక్కడ!" అన్నాడు.

గవర్రాజు ఏడిచేశాడు. మనోహరం సంగ్రహంగా తమ కథంతా చెప్పాడు.

"వెధవా! నిన్ను నాంపల్లిలో దిగమంటే సికింద్రాబాద్‌లో దిగావు కదా! ఆ అజాగ్రత్త వల్లే ఈ తిప్పలు!" అని గవర్రాజుని మందలించి, భాస్కరం తన జి.ఎం.తో చెప్పేసి ఆఫీసు కారులో వాళ్లిద్దరినీ ఎక్కించుకుని మాసాబ్‌టాంక్ దగ్గర తన

రూంలో పడేశాడు.

"ఎక్కడికీ కదలకండి! నేను ఇంకో గంటలో వస్తాను. ఊరంతా హత్యలు జరుగుతున్నాయి. రోడ్ మీదకు రాకండి. నేను వస్తూ వస్తూ తినడానికి తెస్తాను. తర్వాత మాట్లాడుకుందాం!" అని వెళ్ళిపోయాడు భాస్కరం.

ఆ విధంగా ఆ గదిలోకి చేరిన గవర్రాజు, మనోహరరావూ ఎకా ఎకిన 13 రోజులు ఆ గది వదిలి బయటికి రాలేకపోయాడు.

మనోహరరావు ఏకబిగిని ఒక మహాకావ్యానికి పూనుకున్నాడు.

వైజాగ్‌లో తన బ్రాకెట్ బిజినెస్‌లో రోజు కెంత నష్టమో తలచుకుని తలచుకుని గవర్రాజు చిక్కి శల్యమైపోయాడు.

వాళ్ళని వదిలించుకుందామన్నా భాస్కరం వదిలించుకోలేకపోయాడు.

వాళ్ళ మూలంగా అతడు తన గదిలో ఏర్పాటు చేసుకున్న ఏకాంత కార్యక్రమానికి తీరని విఘ్నం ఏర్పడడం –

కోపగించిన ఆ కోమలాంగి ఇంకెవరి ప్రతిపాదననో స్వీకరించడం, అది ముదిరి పెళ్ళి దాకా వెళ్ళిపోవడం –

– ఓయమ్మో! అదంతా చాలా పెద్ద కథ!

*(ఆంధ్రప్రభ వారపత్రిక మార్చి '91)*